


# కరపత్రం

SINCE 2014

సోమవారం జనవరి 13 2025 | సంపుటి :0 | సంచిక : 92 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## హైదరాబాద్‌లో స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత



»రేషన్ కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

»హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

»తెలంగాణలోని అన్ని జిల్లాలోని అధికారులతో సమావేశమైనట్లు చెప్పారు.

హైదరాబాద్: ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల పరిశీలన జరుగుతుందన్నారు. 21 నుంచి అర్హులైన వారి డేటా ఎంట్రీ చేస్తామని తెలిపారు. 26 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని వివరించారు. రేషన్ కార్డులకు గతంలో ఉన్న నిబంధనలే వర్తిస్తాయన్నారు. తమ ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టడం లేదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.


మిగతాది 2లో

### సమస్యల పరిష్కారానికి భూసర్వే: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: భూ సమస్యల పరిష్కారానికి భూసర్వే చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నియోజకవర్గాల్లోని ఒక్కొక్క గ్రామంలో సర్వే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంతో భూ యజమానులకు భద్రత కలుగుతుందని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో భద్రాద్రి జిల్లా ఆదర్శంగా నిలవాలన్నారు.

2 లో



### సంక్రాంతికి చలో..

**హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ**


హైదరాబాద్, చౌటుప్పల్ గ్రామీణం: సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు సొంతూళ్ల బాట పట్టారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

2 లో

### రైతుభరోసా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

2 లో

## నాకెలాంటి భేషజాలు లేవు.. ఎవరి సలహాలనైనా స్వీకరిస్తా:



»మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

»తనకు ఎలాంటి భేషజాలు లేవని.. ఎవరి సలహాలనైనా స్వీకరిస్తానని చెప్పారు.

»విద్యాసాగర్‌రావు ఆత్మకథ 'ఉనిక' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం మాట్లాడారు.

"విపక్ష నేతలు అయినా.. అవసరం ఉన్నచోట వారి అనుభవాన్ని వినియోగించుకుంటాం. తెలంగాణ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కృషి చేస్తున్నాం. మెట్రో, రీజనల్ రింగ్‌రోడ్డు విషయంలో కేంద్రం సహకరించాలని ప్రధాని మోదీని కోరాను. కేంద్రం సహకరిస్తేనే.. రాష్ట్రాల అభివృద్ధి పరిపూర్ణమవుతుంది. హైదరాబాద్ మెట్రోకు అనుమతులు తెచ్చుకోవాల్సిన అవసరముంది. ఒకప్పుడు రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో.. నేడు 9వ స్థానానికి పడిపోయింది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కొన్ని రాష్ట్రాల్లో అన్ని పార్టీలు కలిసి పోరాడుతున్నాయి. మనం పోటీ పడాల్సింది అమరావతితో కాదు.. ప్రపంచస్థాయి నగరాలతో" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**40 ఏళ్లు ఆయనతో పనిచేశా..**

**ఏనాడూ మనస్పర్థలు రాలేదు: దత్తాత్రేయ**

విద్యాసాగర్‌రావుతో 40 ఏళ్లు కలిసి పనిచేశానని.. ఆయనతో ఏనాడూ మనస్పర్థలు రాలేదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని..

మిగతాది 2లో

## మంత్రుల సమక్షంలోనే గొడవ..

### కౌశిక్‌రెడ్డిని బయటకు లాక్కెళ్లిన పోలీసులు



»కరీంనగర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది.

»మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే ఎమ్మెల్యేల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. ఒకరినొకరు తోసుకున్నారు.

»పోలీసులు జోక్యం చేసుకుని హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బయటకు తీసుకెళ్లడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మిగతాది 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. భూపాలపట్నం, మద్దేడు ప్రాంతాల్లో ఆపరేషన్ చేపట్టిన క్రమంలో మావోయిస్టులు, భద్రత బలగాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఇక్కడ బందిపోరా, పోరంజెడ్ అడవుల్లో ఈ ఎదురుకార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఘటన స్థలి నుంచి పోలీసులు పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో.. నారాయణపూర్ జిల్లాలోని హెర్‌గైనార్ గుమ్చూర్ కొండల్లో నక్సల్స్ సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



## 'అహంకారం మంచిది కాదు'.. సీఎం స్టాలిన్‌పై గవర్నర్ మండిపాటు!



ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడు లో అధికార డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా భేదాభిప్రాయాలు తలెత్తుతున్న విషయం తెలిసిందే. ఇటీవల శాసనసభ తొలి సమావేశం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ నిష్క్రమించారు. ఈ పరిణామం కాస్త గవర్నర్‌కు, సీఎం ఎంకే స్టాలిన్‌కు మధ్య విమర్శలకు దారితీసింది. ముఖ్యమంత్రికి అంత అహంకారం మంచిది కాదంటూ తమిళనాడు రాజ్‌భవన్ తాజాగా పేర్కొంది.

"జాతీయ గీతాన్ని గౌరవించాలని, రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక విధులను నిర్వర్తించాలని చెప్పడాన్ని అసంబద్ధ చర్యగా, చిన్నపిల్లల చేష్టగా సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. దేశమే సర్వోన్నతం, రాజ్యాంగమే అత్యున్నత విశ్వాసమనే విషయాన్ని ఆయన మర్చిపోవద్దు. వాటిపట్ల అవమానాన్ని దేశ ప్రజలు సహించరు. భారత్‌ను ఓ దేశంగా గుర్తించని, ఆ దేశ రాజ్యాంగాన్ని గౌరవించని నేత.. వాటి వెనక ఉన్న ఉద్దేశాలను వంచించడం సరికాదు. ఇటువంటి అహంకారం మంచిది కాదు" అని రాజ్‌భవన్ పేర్కొంది. గవర్నర్ తీరు చిన్నపిల్లల చేష్టలా ఉందని సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే ఈమేరకు ట్వీట్ చేసింది.

అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయ గీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా.. ఉద్దేశపూర్వకంగానే నిరాకరించారని రాజ్‌భవన్ అంతకుముందు వెల్లడించిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానించే చర్యలకు తోడుగా ఉండకూడదని సభ నుంచి గవర్నర్ వెళ్లిపోయినట్లు వివరణ ఇచ్చింది. గవర్నర్ చర్యలు ఆయన పదవికి వన్నె తేబోవని ముఖ్యమంత్రి స్టాలిన్ 'ఎక్స్'లో స్పందించారు. శనివారం మరోసారి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే రాజ్‌భవన్ ఈమేరకు స్పందించింది.

## భాజపా గెలిస్తే.. మురికివాడలను కూల్చేస్తుంది: కేజ్రీవాల్ ఆరోపణలు



దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు.

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ , భాజపా మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కాషాయ పార్టీపై విరుచుకుపడ్డారు.

"ఐదేళ్లుగా మురికివాడల్లోని ప్రజల వద్దకు భాజపా వెళ్లలేదు. కానీ, ప్రస్తుతం వారి చుట్టూ తిరుగుతోంది. ఎన్నికల్లో వారి ఓట్లు పొందేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ఒకవేళ.. ఎన్నికల్లో భాజపా గెలిస్తే దిల్లీలోని అన్ని మురికివాడలను కూల్చి వేస్తుంది. అక్కడి ప్రజలపై ఆ పార్టీకి ఎలాంటి ప్రేమ లేదు" అని విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు.

"భాజపా ధనవంతుల పార్టీ. అలాంటి నేతలు మురికివాడల్లోని ప్రజల గురించి ఎందుకు పట్టించుకుంటారు..? వారిని చులకనగా చూస్తుంటారు. ఎన్నికల వేళ.. వారి ఓట్లతోనే భాజపాకు పని. ఆ తర్వాత వారి భూములను లాగేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఇటీవల కేంద్రమంత్రి అమిత్ షా మురికివాడల్లోని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అదే సమయంలో ఆయన నన్ను ఉద్దేశిస్తూ వాడిన పదజాలం అభ్యంతరకరంగా ఉంది. ఆయనతో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు. నేను ప్రజల ప్రయోజనాల కోసమే రాజకీయాల్లోకి వచ్చాను" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

## సంక్రాంతికి చలో..

### హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీ రద్దీ

మొదటిపేజీ తరువాయి

ఇక్కడ అరకిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచింది. ఏపీ వైపు వెళ్లే వాహనాలను 12 గేట్ల ద్వారా టోల్ సిబ్బంది పంపిస్తున్నారు. ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాటి కోసం 4 గేట్లు కేటాయించారు.రైళ్లలో రిజర్వేషన్ దొరక్కపోవడం, ప్రైవేటు బస్సుల్లో ఛార్జీలు భారీగా ఉండటంతో కొంత మంది బైక్‌లు, కార్లలో వెళ్తున్నారు. ఆదివారం వేకువజాము నుంచే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. మరోవైపు ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో రద్దీ పెరిగింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో వాహనాలు కిక్కిరిశాయి. నగరం నుంచి జిల్లాలకు వెళ్లే మార్గాల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్లు, ఎల్బీనగర్ కూడలిలో ప్రయాణికుల రద్దీ నెలకొంది.

# మంత్రుల సమక్షంలోనే గొడవ..

## కౌశిక్‌రెడ్డిని బయటకు లాక్కెళ్లిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్: సమావేశంలో మాట్లాడేందుకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ సిద్ధమవుతుండగా కలుగజేసుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి.. మీరు ఏ పార్టీ అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే సంజయ్‌కు మైక్ ఇవ్వొద్దని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. తనకు ఎందుకు మైక్ ఇవ్వకూడదని సంజయ్ ప్రశ్నించగా.. ఏ పార్టీనో ముందు చెప్పి మాట్లాడాలని వాగ్వాదానికి దిగారు. సంజయ్ మాట్లాడుతుండగా అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ఇరువురు నాయకుల మధ్య మాటా మాటా పెరిగి పరస్పరం తోసుకున్నారు. అక్కడే ఉన్న నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా, కౌశిక్‌రెడ్డి వెనక్కి తగ్గకపోవడంతో సమావేశం నుంచి పోలీసులు బయటకు లాక్కెళ్లారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఎదుటే ఈ గొడవ జరిగింది. అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ మారిన సంజయ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు.

## నేను దిల్లీ సీఎం అభ్యర్థి కాదు.. కేజ్రీవాల్ వ్యాఖ్యలపై రమేశ్ బిధూడీ

దిల్లీలో భాజపా ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో తాను లేనని మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ తెలిపారు.

దిల్లీ: మాజీ ఎంపీ రమేశ్ బిధూడీని భాజపా దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిర్ణయించిందని ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేజ్రీవాల్ వ్యాఖ్యలపై రమేశ్ తాజాగా స్పందించారు. సీఎం రేసులో తాను లేనని క్లారిటీ ఇచ్చారు.

"భాజపా పట్ల ఎంత విశ్వాసంగా ఉంటానో.. అంతే ప్రజల పట్ల ఉంటున్నాను. నేను సీఎం అభ్యర్థి అంటూ ప్రచారం చేస్తున్నారు. అవన్నీ వాస్తవాలు కాదు. పార్టీ అన్ని వేళల నాకు అండగా ఉంది. నాపై విశ్వాసంతో ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించింది. అందుకే రెండు సార్లు ఎంపీగా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా. మరోసారి మీకు సేవ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రజల సేవకుడిగా పని చేస్తూనే ఉంటా" అని విలేకరుల సమావేశంలో రమేశ్ బిధూడీ పేర్కొన్నారు.

కాగా.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్, భాజపా ఒకదానిపై మరొకటి తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటున్నాయి. తమకు అందిన సమాచారం మేరకు రమేశ్ బిధూడీనే భాజపా తన సీఎం అభ్యర్థిగా నిర్ణయించిందని అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.



భాజపా తన అభ్యర్థిని ప్రకటించిన అనంతరం దిల్లీ అభివృద్ధి, ఇతర అంశాలపై సీఎం అభ్యర్థులు చర్చలో పాల్గొనాలని కమలం పార్టీకి సవాల్ విసిరారు. దీనిపై తాజాగా స్పందించిన రమేశ్ ఈ వ్యాఖ్యాలు చేశారు.

భాజపా గెలిస్తే.. మురికివాడలను కూల్చేస్తుంది: కేజ్రీవాల్ ఆరోపణలు

ఇదిలా ఉండగా.. దిల్లీ సీఎం అతిశీ ఇంటిపేరు లక్ష్యంగా రమేశ్ బిధూడీ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తన నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ప్రియాంక

## దిల్లీ ఎన్నికల బరిలోకి ఎన్సీపీ.. ఒంటరి పోరుకు సిద్ధం..!

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ప్రకటించింది.

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. త్వరలో జరగబోయే ఈ ఎన్నికల బరిలోకి.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కు చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) దిగనున్నట్లు ప్రకటించింది. 25 నుంచి 30 స్థానాల్లో అభ్యర్థులను నిలపనుంది.

ఇప్పటివరకు దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, భాజపా మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఇకపై ఎన్సీపీ కూడా నిలవనుంది. ఎలాంటి పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది. ప్రధానంగా వివిధ కమ్యూనిటీలకు చెందిన ఓటర్లు ఉన్న ప్రాంతాలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాజధానిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎన్సీపీ దిల్లీ ఎన్నికల్లో దిగడం ఇదే తొలిసారి కాదు. 2020లోనూ ఆ పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేసింది. కానీ, ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. అయితే..



2023లో ఎన్సీపీలోని ఎమ్మెల్యేలతో కలిసి అజిత్ పవార్ తన బాబాయ్ శరద్ పవార్‌పై తిరుగుబాటు చేయడంతో పార్టీలో చీలిక ఏర్పడింది. ఆ సంఘటన తర్వాత దిల్లీ ఎన్నికల్లో ఎన్సీపీ పోటీకి దిగడం ఇదే తొలిసారి.

కాగా.. ఫిబ్రవర్ 5న దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. హ్యాట్రిక్ విజయం సాధించేందుకు ఆప్ శ్రమిస్తుండగా.. రాజధాని గద్దె ఎక్కేందుకు కాంగ్రెస్, భాజపా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల్లో ఎన్సీపీ కూడా పోటీ చేస్తుండడంతో దిల్లీలోని పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

## మేము అధికారంలోకి వస్తే.. నిరుద్యోగ యువతకు రూ.8,500

ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీలో తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. దిల్లీ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండటంతో ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిరుద్యోగులకు యవ ఉడాన్ యోజన కింద రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. ఇది ఉచితంగా ఇచ్చే మొత్తం కాదని వెల్లడించింది. ఆ పార్టీ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ "ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థిక సాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇళ్లల్లో ఖాళీగా కూర్చొనేవారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదు. ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయం చేయడానికే ఈ పథకం తెచ్చాము" అని పేర్కొన్నారు.



ఇప్పటికే జనవరి 6వ తేదీన ప్యారీ దీదీ యోజనను కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ విజయం సాధిస్తే.. ఈ పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామని పేర్కొంది. జనవరి 8వ తేదీన పార్టీ జీవన్ రక్షా యోజనను ప్రకటించింది. దీని కింద రూ.25 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చింది. దిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఓట్లను ఫిబ్రవరి 8వ తేదీన లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

## నాకెలాంటి భేషజాలు లేవు.. ఎవరి సలహాలనైనా స్వీకరిస్తా:

మొదటిపేజీ తరువాయి

మనస్పర్థలు మాత్రం ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏబీవీపీ, భాజపా ఎదుగుదలకు విద్యాసాగర్‌రావు ఎంతో కృషి చేశారన్నారు. గోదావరి జలాలను మళ్లిస్తే తప్ప తెలంగాణ బతుకు లేదని ఎన్నో ఏళ్ల క్రితమే విద్యాసాగర్‌రావు చెప్పారని గుర్తుచేశారు. రాయలసీమకూ 100 టీఎంసీలు తరలించాలని ఆయన ఆకాంక్షించారన్నారు.

### యువత శ్రమశక్తిని బయటకు తీయడమే సవాల్: విద్యాసాగర్‌రావు

నేతలు ఎవరు ఏ పార్టీలో ఉన్నా జాతీయ భావన ఉంటుందని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నా.. భారతీయతను వదులుకోకూడదని అంబేడ్కర్ బౌద్ధమతంలో చేరారని చెప్పారు. తన ఆత్మకథ 'ఉనిక' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విద్యాసాగర్‌రావు మాట్లాడారు. శ్రీపాదరావు ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం ఎంతో కృషిచేశారని.. అందుకే ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టాలని భాజపా తీర్మానం చేసిందన్నారు. రథయాత్ర సమయంలో అశ్వమేధ యాగం చేస్తున్నారని ఆడ్వాణీని ఎన్టీఆర్ మెచ్చుకున్నారని చెప్పారు. ఎన్టీఆర్ తన సినిమాల్లో బీసీ వాదాన్ని సమర్థంగా తెరకెక్కించారన్నారు.

ఇంకా దేశంలో ఐదో వంతు పేదరికం ఉందని.. దానికి పరిష్కారం చూపాలన్నారు. యువతలోని శ్రమశక్తిని బయటకు తీయడమే ఇప్పటి నేతలకు అసలైన సవాల్ అని చెప్పారు. వారిని ప్రోత్సహించకపోతే గంజాయి వంటి దురలవాట్లకు లోనవుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 'హైడ్రా' ఆలోచన అభినందనీయమని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువైన సంపద ఉందని.. దాన్ని వెలికితీసి వారి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. హైడ్రా తరహాలో గిరిజన భూ సమస్యల పరిష్కారానికి ఓ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.

## హైదరాబాద్‌లో స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి

"హైదరాబాద్‌లో స్థలం ఉండి ఇల్లు లేని వారికి తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఇల్లు లేని వారందరికీ మంజూరు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లాల నుంచి వలస వచ్చిన వారికి కూడా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. వీటి పంపిణీలోనూ ఆదర్శంగా నిలుస్తాం. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ న్యాయం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేస్తాం. ఈ విషయంపై గుత్తేదారులతో మాట్లాడతాం. పూర్తయిన ఇళ్లను లాటరీ వేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## రైతుభరోసా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రైతుభరోసా మార్గదర్శకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ చేయనున్నారు. భూభారతిలో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూములకే ఈ సాయం దక్కనుంది. భూవిస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు దీన్ని అందించనున్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా సాయం అందజేస్తారు. సాగుయోగ్యం కాని భూములను రైతుభరోసా నుంచి తొలగించనున్నారు. ఫిర్యాదుల పరిష్కారం బాధ్యత కలెక్టర్లకు అప్పగించారు. రైతుభరోసా ఉత్తర్వులను ప్రభుత్వం తెలుగులో జారీ చేసింది.

## గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు!

2025 గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరయ్యే అవకాశం ఉన్నట్లు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏళ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాంటో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోదీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.గత ఏడాది ప్రబోవో ప్రధాని మోదీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు లో ప్రబోవో ప్రధాని నరేంద్రమోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చలు జరిపారు. 1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హొలన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కొవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మెక్రాన్ ను ఆహ్వానించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జనవరి 13 2025

# పద పదవె వయ్యారి గాలిపటమా...

**సిటీ డెస్క్ సహకారంతో**
**కరుణాకర్ మల్లిగారి**

సంక్రాంతి అంటే పతంగుల పండగ.తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి వేడుకలది ప్రత్యేక స్థానం. పండగ వేడుకల్లో పూజలు, కొత్త బట్టలు, పిండి వంటలతో పాటు వినోద కార్యక్రమాలు సంక్రాంతి ప్రత్యేకత.ఆంధ్రప్రదేశ్ లో కోడిపందాలు ఆడటం, తెలంగాణలో గాలిపటాలు ఎగరవేయడం ప్రత్యేక ఆకర్షణ.రెండు రాష్ట్రాల్లోనూ సంక్రాంతి పండగను సంబరాలను ప్రతిబింబించే ప్రతీకలుగా వీటిని భావిస్తారు.తెలంగాణలో పతంగుల వేడుకకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రం.కుతుబ్‌షాహీల కాలం నుండి ఈ ప్రాంతంలో గాలిపటాలకు ఆదరణ ఉందని చరిత్రకారుల అభిప్రాయం.హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా సంక్రాంతి రోజుల్లో ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు ఎగరడం చూడవచ్చు. గాలి పటాలకు పుట్టిల్లు చైనా అనే ఒక అభిప్రాయం కూడా ఉంది.

మెజారిటీ చరిత్రకారుల అభిప్రాయంలో గాలిపటానికి పుట్టిల్లు చైనా అని, వేర్వేరు సమయాలు, సందర్భాల్లో ఇది విశ్వవ్యాప్తం అయిందని కూడా




అభిప్రాయాలున్నాయి.సిల్క్‌రూట్ వెంబడి ప్రయాణించిన బౌద్ధమత శ్రేణుల ద్వారా గాలిపటం భారత దేశానికి చేరిందనేది చరిత్రకారుల అభిప్రాయం.అయితే భారత సాహిత్యంలో ఈ పతంగుల ప్రస్తావన ఉంది.సామాన్య శకం 1270-1350 సం.ల మధ్య కాలంలో మహారాష్ట్రకు చెందిన భక్త కవి సంత్ నామ్‌దేవ్ గారి 'నామదేవ్ గాథ'లో మొదటిసారి గాలిపటం గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.ఇందులో ఆయన గాలిపటాన్ని సూచిస్తూ 'గుడి' అనే పదాన్ని ఉపయోగించారు.కాగితంతో తయారు చేసిన గాలిపటాన్ని ఒక వ్యక్తి దారంతో ఎగురవేస్తుండగా, అక్కడి ప్రజలు చూసి ఆనందించారని ఆయన రాశారు.ఈ వివరాలు మహారాష్ట్రకు చెందిన సంస్కృత పరిశోధకుడు పరశురాం కృష్ణ గోడే 1956 సం.లో సమర్పించిన తన పరిశోధన పత్రంలో పేర్కొన్నారు.మొఘలుల పాలన సమయానికి గాలిపటాల క్రీడ జనరంజకంగా మారిందని ఆనాటి కొన్ని పెయింటింగ్స్ ద్వారా తెలుస్తోంది.మొఘల్ ప్రతినిధులుగా వచ్చి ఆ తర్వాత స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసిన కుతుబ్ షాహీల కాలంలో దక్కన్ ప్రాంతంలో గాలిపటాలకు విస్తృత ఆదరణ ఉండేదని కొంతమంది చరిత్రకారులు అభిప్రాయం."కుతుబ్ షాహీల పాలనలో హేమంత రుతువులో కాగితాలతో తయారుచేసిన పతంగులను, మూలికలు రుద్దిన దారాల సహాయంతో ఎగురవేసేవారు. ఆ తర్వాత అసఫ్ జాహీల పాలనలోనూ ఇది కొనసాగింది.ఆరవ నిజాం ఆధ్వర్యంలో హైదరాబాద్ మైదానాల్లో పెద్ద ఎత్తున పతంగుల పోటీలు జరిగేవని విన్నాం. 1990 వరకు హైదరాబాద్ పాతబస్తీలో పతంగుల పోటీలు జరిగేవని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీ రామోజు హరగోపాల్ తన పరిశోధనలతో తెలిపారు.గాలిలో ఎగరాలని, ఆకాశయానం చేయాలనే మనిషి కాంక్షకు గాలిపటం ప్రతిరూపం. కీలుగుర్రం లాంటి ఊహలు ఇలాంటివే.ఉత్తరాయణంలో సూర్యునితో పాటూ గాలి దిశలు కూడా మారుతాయి. గాలి వీచే దిశ, తీవ్రత తెలుసుకోవడానికి గుడ్డలు, కాగితాలు ఎగురవేయడం మొదటి నుండి ఉందని హరగోపాల్ వివరించారు.మతాలకు అతీతమైన పతంగులు అందరికీ ఇష్టమైన ఆట.హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని కొన్ని ఇరుకైన వీధులు, పతంగుల తయారీ కేంద్రాలు. పతంగుల తయారీ ఇక్కడ కుటీర పరిశ్రమ.'ఇది మతాలకు అతీతమైన క్రీడ' అన్నారు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంస్థకు చెందిన అనురాధా రెడ్డి.'మా చిన్నతనంలో హైదరాబాద్ లో విశాలమైన బహిరంగ ప్రదేశాలుండేవి. పాతబస్తీ నుండి మాంజా కొనితెచ్చి పతంగుల పోటీల్లో పాల్గొనేవారం. ఆ తర్వాతి రోజుల్లో మా పొరుగు వారినుండి, పక్కింటి కుటుంబాల దగ్గర గుడ్లు తెచ్చి దాని సొనకు కాంచ్ అంటే గ్లాస్ పొడి, బంక , కలర్స్ కలిపి స్వయంగా మాంజా తయారీ చేసే వాళ్ళమని అన్నారు. లైట్ వెయిట్, హెవీ వెయిట్ ఇలా రకరకాల పతంగులు ఉండేవి. పతంగుల ఆట కోసమే వాడే ప్రత్యేక పదాలుండేవి. సాదా పతంగ్, చరకా పతంగ్, డోరా పతంగ్, పేంచ్ పతంగ్, లడాయి పతంగ్ లని రకరకాల పేర్లు ఉండేవి. కటీ పతంగ్ అంటే తెగిన గాలిపటాలు దొరకబుచ్చుకుని వాటి తయారీ విధానం, వాడిన దారం వంటి అంశాలను అధ్యయనం చేసేవాళ్లం" అని చాలా మంది పెద్దలు తమ అనుభవాలు వెల్లడిస్తుంటారు.అప్పటి మజా ఇప్పుడు లేదు. ఇప్పటి చైనా మాంజాలతో ప్రజలు, పక్షులు, జంతువులకు హాని పొంచి ఉందని ప్రభుత్వం గుర్తించింది. చైనా మంజా తో పిల్లలు పెద్దల ప్రాణాలకు ప్రమాదాలు కలుగుతున్నాయి. ఎగరేసిన గాలి పటాల చైనా మంజా రోడ్డుపైన,తీగల పైనా,చెట్ల పైనా,ఇళ్ల




పైనా చిక్కుకుని గొంతులు తెగి ప్రాణాలు పోతున్న సంగతి మనం వింటున్నాం.తెలంగాణ పోలీసులు చైనా మంజా ఉపయోగించకూడదని చెబుతున్నారు.పిల్లలకు పెద్దలకు అవగాహన కలిగిస్తున్నారు.మనోల్లాసానికి ఆడే పరంగుల ఆట ప్రాణాంతకంగా మారకుండా అందరూ కృషి చేయాలి.కాలం మారినా పతంగుల రూపకల్పనలో మార్పులు వచ్చినా ఈ గాలిపటాల వేడుక నిరంతరం కొనసాగుతూనే ఉన్నది.గాలిపటాల తయారీ వైవిధ్యం మారినా, దాని తోక మాత్రం మనల్ని అలరిస్తూనే ఉంటుంది.నీకు ఎవరిచ్చారే బిరుదు తోక..కొని తెచ్చావేమో అంతేగాక..రాజులెందరూడినా, మోజులెంత మారినా తెగిపోక నిలిచె నీ తోక..అని 1960 సం.లో వచ్చిన కులదైవం సినిమాలోని గాలిపటం పాట ఇప్పటికీ నిత్య నూతనంగా వినిపిస్తుంటుంది.

**హాపీ సంక్రాంతి.. సేఫ్ సంక్రాంతి.**

## ఉత్తమ బోధన కేంద్రాలుగా గురుకులాలు...



**- గురుకుల ప్రవేశ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి...**

**కరపత్రం శంకరపట్నం జనవరి 12**

ఉత్తమ బోధనా కేంద్రాలుగా గురుకులాలు పని చేస్తున్నా యని మానకొండూరు శాసనసభ్యుడు డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఎల్ఎండి కాలనీలోని క్యాంపు కార్యాలయం ప్రజా భవన్ లో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ నోటిఫికేషన్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపేద లైన ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీలకు గురుకులాలు ఎంతో ఉపయుక్తమన్నారు. గురుకులాల్లో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యను అందిస్తున్నారని ఆయన చెప్పారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారంఅందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మేర మెస్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ గురుకులా లలో ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ను వచ్చే నెల 23న నిర్వహిస్తుండగా, దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 వరకు గడువు ఉందన్నారు. రాష్ట్రంలోగురుకుల ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, విద్యార్థులు గురుకులాల్లో ఐదో తరగతి నుండి, మొదలుకొని 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకో వాలని ఆయన పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులు కోసం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్,దేవంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, సీఓఈ శ్రీనివాస్ రెడ్డి, గురుకులాల పూర్వ విద్యార్థి, పేరెంట్ మొగురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నందన్ నేటికీ కేశవపట్నం యువత గుండెల్లో...

**- ముగ్గుల పోటీలను నిర్వహించిన కుటుంబ సభ్యులు....**
**కరపత్రం: శంకరపట్నం జనవరి 12**

అకాల మరణం చెందిన గాజుల నందన్ అలియాస్ చోటు నేటికీ కేశవపట్నం యువత గుండెల్లో కుటుంబ సభ్యుల గుండెల్లో నిలిచిపోయారని ఆహ్వానితులు అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం కేశవపట్నం గ్రామానికి చెందిన చెందిన గాజుల నందన్ అలియాస్ చోటు ఇటీవల అకాల మరణం చెందంగా తల్లిదండ్రులు గాజుల శ్రీనివాస్ రమాదేవి సంక్రాంతి పండగను పురస్కరించుకొని, కేశవపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు మహిళలు హాజరై రంగవల్లులు అద్ది తమ ప్రతిభను రంగవల్లులు అద్ది కనబరిచారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు, యువతులకు నందన్ తల్లిదండ్రులు శ్రీనివాస రమాదేవి ఆయన జ్ఞాపకార్థం ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు పేర్కొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఖబర్దార్ ఎమ్మెల్యే

**- మాజీ జెడ్పిటిసి బిజేపి కంటేస్టెడ్ ఎం ఎల్ ఏ విజయ్ కుమార్**
**- పనులు మొదలు పెట్టేవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయి- నస్కల్ గ్రామస్తులు**

**కరపత్రం నిజాంపేట్**




గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు అయిన నస్కల్, రాంపూర్, నందగోకుల్, చల్మెడ, రోడ్డు పనులు మొదలుపెట్టి మధ్యలోనే నిలిపివేయడం తో నాలుగు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండల మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నస్కల్ గ్రామ ప్రజలకు సంఘీభావం తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడుపాయలకు, చర్చికి నిధులను తీసుకువచ్చిన ఎమ్మెల్యే నస్కల్ రోడ్డు పనులకు నిధులను ఎందుకు ఇప్పించడం లేదని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఖబర్దార్ ఎమ్మెల్యే అంటూ మండిపడ్డారు .ఎన్నికలలో ప్రచారానికి వచ్చినప్పుడు ఈ రోడ్డు పరిస్థితి చూశారు కదా గెలిచిన తర్వాత రోడ్డును బాగు చేయిస్తానని చెప్పి ఇప్పటికీ సంవత్సరం అవుతున్న పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 'ఏ ఆర్ ఆర్ ' అనగా (ఎనుముల రేవంత్ రెడ్డి )కి టాక్స్ చెల్లించాలని , నియోజకవర్గంలో ' ఎం ఆర్ ఆర్ ' (మైనంపల్లి రోహిత్ రావు ) కు టాక్సులు వీరికి చెల్లించినట్లయితే బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. హంగులు ఆర్భాటాలతో ప్రచారాలు చేసుకుంటున్నారు తప్ప అభివృద్ధి చేయడం లేదని ఏ ఒక్క రోడ్డు కూడా వేసింది లేదన్నారు. గతంలో మీ నాన్నగారు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మెదక్ ను ఎలాంటి అభివృద్ధి చేయలేదని మాటలు చెప్తున్నారు తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదన్నారు. రోడ్డు పనులను మొదలు పెట్టనట్లయితే నాలుగు గ్రామాల ప్రజలతో గడపగడపకు తిరిగి పాదయాత్ర చేయడం జరుగుతుందన్నారు. సిపిఎం నాయకురాలు బాలమణి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రస్తుతము కాంగ్రెస్ ప్రభుత్వము ద్వంద విధానాలు వ్యవహరిస్తుందన్నారు. నాలుగు గ్రామాలకు వెళ్లే రోడ్డు కంకర పోసి విడిచిపెట్టినందున ద్విచక్ర వాహనాలు నడవలేకపోతున్నాయని అనేక యాక్సిడెంట్లు అవుతూ ఎంతోమంది ప్రాణాపాయంలో హాస్పిటల్ లో కాళ్ల చేతులు విరిగి అవస్థలు పడుతున్నారని అన్నారు. రోడ్డు పనులు మొదలు పెట్టనట్లయితే నాలుగు గ్రామాల నుండి మహిళలను తరలించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతానన్నారు . ఈ కార్యక్రమంలో దుబాసి సంజీవ్, దేషెట్టి లింగం, ఎల్లం యాదవ్, దుర్గయ్య.శంకర్ గౌడ్ , సిద్ధరాంరెడ్డి, జిపి స్వామి, అబ్దుల్ పాషా, జాల పోచయ్య, గరుగుల సుధాకర్, మెట్టు లింగం, తమ్మలి మురళి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కి మల్లాపూర్ పద్మశాలీల కృతజ్ఞతలు



**కరపత్రం జనవరి 12**

మల్లాపూర్ మండల కేంద్రంలో నంది చౌరస్తా పద్మశాలి సంఘ భవనానికి వారి కేంద్ర ఎంపీ నిధులు ప్రకటించిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ కు ఇక్కడ పద్మశాలిలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మల్లాపూర్ మండల బిజెపి నూతన అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మల్లాపూర్ మండల పద్మశాలీలు ఎల్లవేళలా అనాది నుండి భారతీయ జనతా పార్టీకి వెన్నుముకగా నిలిచారని గుర్తుచేస్తూ అలాగే భారత ప్రధాని నరేంద్ర మోడీ కల్పిస్తున్న ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేసే బాధ్యత ప్రతి ఒక్క భాజపా కార్యకర్తపై ఉందని అలాగే ఎంపీ నిధుల నుండి మల్లాపూర్ నంది చౌరస్తా పద్మశాలీల సంఘ భవనానికి నాలుగు లక్షల రూపాయలు మాన్యశ్రీ ఎంపీ ధర్మపురి అరవింద్ కేటాయించారని అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు అలాగే పుర ప్రముఖులు విద్యా ప్రదాత ప్రస్తుత పద్మశాలి సంఘం అధ్యక్షులు సిరిపురం రవీందర్ మాట్లాడుతూ పద్మశాలి కుల సభ్యుల ఉన్నతికి పాటుపడుతున్న అలాగే కుల సంఘ భవన నిర్మాణానికి ప్రస్తుతం అవసరమైన నిధులు మంజూరు చేసిన గౌరవ నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే మల్లాపూర్ మండల పద్మశాలీల పట్ల వారి యొక్క ఎనలేని ప్రేమను చూపిన మల్లాపూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గోపిడి శ్రీనివాస రెడ్డికి అలాగే కోరుట్ల నియోజకవర్గ మల్లాపూర్ మండల ఇన్చార్జి వద్దేపల్లి శ్రీనివాస్కి పద్మశాలీల ఔనత్యానికి పాల్పడుతున్న ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ నాయకులు పద్మశాలిలకు చేస్తున్న ఎనలేని సేవలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇట్టి కార్యక్రమంలో మల్లాపూర్ మండల పార్టీ ఇంచార్జి వద్దేపల్లి శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఎర్ర రాజు లవంగ శివ ఇల్లెందుల మనోజ్ ముస్కరీ రాజకుమార్ శక్తి కేంద్రం ఇన్చార్జి కనుక రాకేష్ భారతీయ కిసాన్ సంఘ సభ్యులు మొరపు జలపతి పద్మశాలి కుల బాంధవులు చిప్ప రాజం చిప్ప భరత్ చిప్ప రవీందర్ చిప్ప లక్ష్మను చింతకింది రాజు గూడూరు ప్రవీణ్ సిరిపురం లక్ష్మీరాజం పోతు సురేషు అడ్డగట్ల ప్రసాదు చిలుక తుక్కారాం పాల్గొన్నారు

## స్వామి వివేకానంద ఆశయాలు... యువతకు ఆదర్శం..



బిజెపి మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్...

కరపత్రంవీణవంక, జనవరి 12.
వీణవంక కేంద్రంలో ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవ ఉత్సవాలనుపురస్కరించుకొని స్వామి వివేకానంద చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువతతోనే సాధ్యమని ఏ దేశంలో అయినా యువతే ఆ దేశానికి ప్రతిభ అని ప్రపంచ దేశాలకు సాటి చెప్పినా గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో విశిష్ట అతిథి జిల్లా కార్యదర్శి నరసింహారాజు,ముత్యాల రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి,ఉడుత కుమార్, వరుకోల్ రాజు, రాజు,భూత్ అధ్యక్షులు దాసారపు అశోక్, కంకల సంతోష్, నాగరాజు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద

- జిన్నారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన స్వామి వివేకానంద 162 వ జయంతి కార్యక్రమం
- జిన్నారం గ్రామ స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల అలంకరణ
- స్వామి వివేకానంద చిత్రపటానికి పూల అలంకరణ చేసిన ముఖ్య నాయకులు
- జి. వెంకటేశం గౌడ్, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు
- దళిత రత్న డా. ఏర్పుల శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ తెలంగాణ రాష్ట్ర నాయకులు
- ప్రముఖ సామాజిక నాయకుడు నవభారత్ యువసేన అధ్యక్షులు మెట్టు శ్రీధర్



**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా**
సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో జిన్నారం గ్రామ వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో 162 వ స్వామి వివేకానంద జయంతి నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి సబ్ అధ్యక్షత వహించిన గోకర్ నికుల్ గౌడ్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం ప్రతి ఏడు నిర్వహిస్తూ యువతకు స్ఫూర్తిని ఇవ్వడంలో సంతోషంగా ఉందని, యువజన వారసుల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు జాతీయ నిఖిల్ కోయిల్ అవార్డు గ్రహీత మాజీ ఉమ్మడి రాష్ట్రా యువజన సంఘాల ఉపాధ్యక్షులు జి. వెంకటేశం గౌడ్, దళిత రత్న డా.ఏర్పుల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు, ప్రముఖ సామాజిక నాయకులు నవభారత్ నిర్మాణ యువసేన అధ్యక్షులు మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశం గర్వపడే విధంగా భరతమాత ముద్దుబిడ్డగా స్వామి వివేకనంద చికాగో సర్వమత సమావేశానికి భారతదేశ ప్రతినిధిగా హాజరై భారతదేశ ఔన్నత్యాన్ని ఖ్యాతిని, సాంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందుడు అని ఆ మహనీయుని స్ఫూర్తిని తీసుకొని, అడుగుజాడలలో యువత నడుచుకోవాలని సమాజానికి స్ఫూర్తిని ఇవ్వాలని భవిష్యత్ తరాల ప్రజా నాయకులుగా ఎదగాలని సూచించడం జరిగింది. యువతీ యువకులు గొప్ప గొప్ప చదువులు చదివి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలి అన్నారు, స్వామి వివేకానంద ని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా ప్రజా నాయకులుగా ప్రాతినిధ్యం వహించి భారత దేశ ఔన్నత్యానికి పాటుపడాలన్నారు, యువత చెడు మార్గంలో పోకుండా మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తూ కంకణబద్ధులై స్వామి వివేకానంద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జ్యోతిరావు పూలే లాంటి మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని భారత దేశ కీర్తిని సాధించాలని యువతరం ఐక్యమై యువజన సంఘాల ద్వారా గొప్ప సంకల్పబలంతో సమాజ మార్పు కోసం కంకణ బదులు కావాలన్నారు, యువతీ యువకులు వివిధ రంగాల్లో ప్రాతినిధ్యం వహించి క్రీడా స్ఫూర్తితో పాటు సామాజిక సేవ స్ఫూర్తిని కలిగి ఉండాలని అన్నారు, మహనీయులు స్వామి వివేకానంద జయంతి కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా స్వామి వివేకానంద జయంతి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా రాష్ట్ర బాధ్యులు కే . చేన్న గారు, ఎల్ కె చందర్ గారు రమేష్ ఇంతియాజ్ జత్య నవాజ్ ప్రసన్న కుమార్ సత్యనారాయణ సంతోష్ కుమార్ మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గొర్ల శ్రీనివాస్ యాదవ్ తాలూకా కన్వీనర్ తాలూకా యువజన సంఘాల సమితి పటాన్చెరు నియోజకవర్గం. గోకరి నిఖిల్ గౌడ్, వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జిన్నారం.నాయి కోటి రాజేష్ మండల అధ్యక్షులు బి.ఆర్.ఎస్. పార్టీ జిన్నారం మండలం, శ్రీనివాస్ గౌడ్, బి. బ్రహ్మేంద్ర గౌడ్,గోపి,శ్రీధర్ గౌడ్ ,మల్లేష్,,అనిల్, రాజ్ కుమార్,సాయి గౌడ్,శివ,అరుణ్,వికాస్,చిరంజీవి, శేఖర్,సంజీవ్,సాయి,రాజు,అనిల్,సుమంత్,అంకుష్, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందాలి వంద-శాతంగర్భిణీల నమోదు చేయాలి.

## ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరగాలి.పీహెచ్ సి లలో మందులు అందుబాటులో ఉండాలి.

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్.**

మెదక్ పట్టణంలోమాతా శిశు సంరక్షణ కేంద్రం, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్య శాఖ కు సంబందించిన అన్ని అంశాలలో వంద శాతం పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ మెదక్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మాతా శిశు సంరక్షణ కేంద్రం ను ఆకస్మికంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా సిబ్బంది హాజరు పట్టికలు, మందుల స్టాక్ రిజిస్టర్ , ఓపి రిజిస్టర్ ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో అన్ని సబ్ సెంటర్ , పీ హెచ్ సి , జిల్లా ఆసుపత్రిలో ప్రజల కు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు పీ హెచ్ సి ల వైద్య అధికారులతో, ఏ ఎన్ ఎమ్ ఆశ లతో ఓ పి, గర్భిణీ నమోదు తదితర అంశాలను అడిగి



తెలుసుకున్నారు. అలాగే పి హెచ్ సి, వైద్య అధికారులు సబ్ సెంటర్ సిబ్బంది తో రివ్యూ చేసుకోవాలన్నారు .వైద్య శాఖ కు సంబందించిన అన్ని అంశాలలో వంద శాతం పురోగతి రావాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అంగన్వాడీ,ప్రభుత్వ పాఠశాల లో 1 సంవత్సరం నుండి 15 సంవత్సరాలు గల విద్యార్థులను ఆర్ బి ఎస్ కె టీం క్షుణ్ణంగా పరిశీలించి... వారి ఆరోగ్య పరిస్థితుల పైన నివేదిక సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే సాధారణ ప్రసవాలు జరగాలని....ప్రయివేట్ ఆసుపత్రి



లో అధిక సంఖ్య లో సి సెక్షన్ లు జరుగుతున్నాయని... దీని మీద వైద్య శాఖ అధికారులు ద్రుష్టి పెట్టాలన్నారు ప్రైవేట్ గైనకాలజిస్ట్ డాక్టర్స్ , సిబ్బంది కి ప్రసూతి సేవలపై ఓరియంటేషన్ ఇచ్చి సాధారణ ప్రసవాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు సబ్ సెంటర్ , పీహెచ్ సి లా వారీగా వైద్య సేవలు మెరుగు పడాలన్నారు ప్రతి పీహెచ్సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కొండపాక గౌడ సంఘానికి బోర్ మోటర్ పంపిణీ..



అన్నా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 12.**
అన్నా చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించిన సందర్భంగా ఆదివారం ట్రస్ట్ చైర్మన్ టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి, వీణవంక మండలం కొండపాక గ్రామ గౌడ సంఘానికి, గ్రామ దేవాలయాలకు 24 వేల విలువైన బోరు మోటర్ ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీణవంక మండలం యువజన కాంగ్రెస్ నాయకులు ఆవాల రామకృష్ణ,కొండపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యడగోని శ్రీనివాస్,ఎండి సలీం, సాయిని రమేష్,పడాల శంకర్, వడ్లకొండ మల్లయ్య,మ్యడగొని మొగిలి, గట్టు అజయ్,మ్యడగొని సమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బిజిగిరిషరీఫ్ గ్రామం లో యువతి మిస్సింగ్ కేస్ నమోద్ చేసిన పట్టణ సి ఐ వరగంటి రవి

**కరపత్రం జమ్మికుంట జనవరి 12**

జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన సంగి శంకర్, తండ్రి పేరు రాజయ్య అను వ్యక్తికి ముగ్గురు సంతానం పెద్ద కూతురు సంగి అస్మిత, వయసు 19 సంవత్సరాలు కరీంనగర్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. కరీంనగర్ లోనే హాస్టల్లో ఉంటూ చదువును కొనసాగిస్తుంది. ఇట్టి క్రమంలో సంక్రాంతి సెలవులు రావడంతో స్వగ్రామమైన బిజిగిరి షరీఫ్ కు ఎనిమిదవ తారీఖు రోజున ఇంటికి చేరుకుంది. అయితే హాస్టల్లో తన



దుస్తులు ఉన్నాయని చెప్పి10వ తారీకు రోజున సంఘీ అస్మిత కరీంనగర్ హాస్టల్ నుండి బట్టలు తీసుకు వస్తానని చెప్పి వెళ్ళి రాత్రి తొమ్మిది అయినా కూడా ఇంటికి రాకపోవడంతో దిగులు చెందిన తల్లిదండ్రులు తనకు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. వారి బంధువులకు కూడా ఫోన్ చేయగా అక్కడికి రాలేదని తెలపడంతో శనివారం కరీంనగర్ హాస్టల్ కు వెళ్లి తల్లిదండ్రులు విచారించగా తమ కూతురు ఎనిమిదో తారీకు రోజున ఇంటికి వెళ్లినట్టుగా హాస్టల్ సిబ్బంది తెలపగా నేరుగా జమ్మికుంట పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయగా శనివారం రోజున యువతి మిస్సింగ్ కేసును నమోదు చేసినట్టుగా జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి తెలిపారు..

## టిపిసిసి అధికార ప్రతినిధి,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ గౌడ్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 12.**



హుజురాబాద్ నియోజకవర్గం లోని వీణవంక, ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, వంగ రామకృష్ణ లు ఆదివారం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తలను,నాయకులను గుర్తించి వివిధ నామినేటెడ్ పదవులు,పార్టీ పదవులలో అవకాశం కల్పించాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతి కార్యకర్తలను గుర్తించి సర్పంచులుగా,ఎంపీటీసీలుగా,జడ్పీటీసీలుగా అవకాశం కల్పించాలని ఇల్లందకుంట మరియు వీణవంక మండలాల్లోని పలు సమస్యల పై వినతి పత్రం అందించడం జరిగింది వెంటనే వారు స్పందించి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మానుకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కి ఫోన్ చేసి సత్వరమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీణవంక యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం సురేందర్ రెడ్డి, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు కాటిపల్లి అజయ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మహేష్ మందల అనిల్ రెడ్డి, మడ్డి కిషోర్,ఎల్బాక సదయ్య, అడిగోప్పల వెంకన్న , గుంటిరవీందర్,గూటంసమ్మిరెడ్డి ,వీరారెడ్డి,భోగం చిరంజీవి సాయిరెడ్డి, కుమర్ రెడ్డి,భోగం రాజు, వంగ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు...

- అమ్మ ఫౌండేషన్- మల్లారెడ్డిపల్లి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 12.**
వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలోని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద 162 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... స్వామి వివేకానందుడు ప్రపంచ సర్వమత సమ్మేళనంలో పాల్గొన్నప్పుడు తనను చులకనగా చూసినారని, తను ప్రసంగాన్ని మై డియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అని ప్రారంభించగానే అందరూ మంత్రముగ్ధులై తన ప్రసంగం అయిపోయేంతవరకు ఎవరు కూడా వెళ్లలేదని, తను సమస్త సకల జనులకు ఎన్నో బోధనలు చేశారని, యువతకు మార్గదర్శకులయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక, అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, సభ్యులు గంధం సుమన్, కళాకారుడు వేణు, సంధి చంద్రారెడ్డి, సంధి తిరుపతిరెడ్డి, కాంతాల సంపత్ రెడ్డి, పర్తం సమ్మయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

